సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 21 । జూలై । 2023



హైవేపై ట్రాఫిక్ జామ్

గుండ్రాంపల్లి శివారులో హైవేపై రోడ్డు ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. - 8లో



దేశ భవిష్యత్‌ను ...

దేశ భవిష్యత్‌ను బీజేపీ దిగజారుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27°/25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి పర్యటన వాయిదా

సూర్యాపేట: ఈనెల 24న సూర్యాపేట జిల్లాలో జరగాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పర్యటన వాయిదా పడినట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన సందర్భంగా సూర్యాపేట జిల్లా నూతన కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం, సమీకృత మార్కెట్ ప్రారంభోత్సవం చేసేందుకు కార్యక్రమాన్ని రూపొందించి తగిన ఏర్పాట్లు కూడా చేశామని గుర్తు చేశారు. అయితే రెండు మూడు రోజులుగా రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడంతో పర్యటన వాయిదా అని వార్యమైనట్లు ఆయన పేర్కొన్నారు.

పారదర్శకంగా విద్యార్థుల ఎంపిక



డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో డ్రా పద్ధతిలో నిర్వహించిన విద్యార్థుల ఎంపిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బెస్ట్ అవైలబుల్ పథకంలో 1వ తరగతిలో 94, 5వ తరగతిలో 98మంది విద్యార్థులను లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ స్కీంలో ఎంపికైన పిల్లలను తల్లిదండ్రులు కార్పొరేట్ స్కూల్‌లో చేర్పించి చదివించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి కె. దయానందరాణి, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టప్రా) జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు ఆరోపించారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం గురువారం టాప్రా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు నిరసన కార్యక్రమాలు చేపట్టినా తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం పెన్షనర్లను వృద్ధులుగా భావిస్తోందని, ఓట్ల రాజకీయమే చేస్తోందని విమర్శించారు. తమ కుటుంబాల పరంగా 30 లక్షల ఓట్లు ఉన్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా పెన్షనర్ల డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి బెడ్డ సోమయ్య, ఉపాధ్యక్షులు మల్లు వెంకట్రాంరెడ్డి, కోశాధికారి మన్నె యాదగిరి, వై.అంజయ్య పాల్గొన్నారు.

పొంగులేటికి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మీదుగా ఖమ్మం వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి 7స్టార్ హోటల్ వద్ద గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ప్రచార కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఆసరా.. అవస్థలు!

- మున్సిపాలిటీల పరిధిలో పింఛన్ కోసం లబ్ధిదారుల పాట్లు
- ఎప్పుడు వస్తాయో ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి
- ప్రతి నెలా పోస్టాఫీసుల వద్ద తప్పని పడిగాపులు
- బ్యాంకు ఖాతాలు తెరిచినా అమలుకు నోచని డబ్బుల జమ ప్రక్రియ



తిరుమలగిరిలో పోస్టాఫీస్ ఎదుట పింఛన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

రోజూ తిరగాల్సి వస్తోంది

ఆసరా పింఛన్ ప్రతి నెలా ఏ తేదీన ఇస్తారో తెలియడంలేదు. పింఛన్ కోసం పోస్టాఫీస్‌కు రోజూ తిరగాల్సి వస్తోంది. బ్యాంకుల్లో జమ చేస్తే అవసరమైనప్పుడు డబ్బులు తెచ్చుకుంటాం.

– సోమయ్య, మాలిపురం.

తిరుమలగిరి పట్టణానికి చెందిన కొండయ్యకు పింఛన్ వస్తోంది. ఈ పింఛన్ తీసుకోవడానికి ప్రతి నెలా స్థానికంగా ఉన్న పోస్టాఫీస్‌కు వెళ్లాల్సి వస్తోంది. బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడక రోజూ తిరగాల్సి వస్తోంది. బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నా డబ్బులు జమ చేయడంలేదు. ఇదీ.. మున్సిపాలిటీల్లోని పింఛన్ దారుల పరిస్థితి.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఆసరా పింఛన్ కోసం మున్సిపాలిటీల్లోని లబ్ధిదారులు ప్రతి నెలా ఇబ్బందుల పడాల్సి వస్తోంది. పింఛన్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు ఇస్తారో తెలియక పోస్టాఫీసుల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ డబ్బులు జమ చేయాలని ఆదేశాలున్నా ఆచరణకు నోచుకోవడంలేదు. పాతవిధానాన్నే కొనసాగిస్తుండడంతో బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడక, రోజూ తిరగలేక, గంటల తరబడి క్యూలో నిల్చోలేక ఐదు మున్సిపాలిటీల్లోని 31,925 మంది పింఛన్ దారులు అవస్థలుపడుతున్నారు.

ఖాతాలు తెరిచినా..

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పాత మున్సిపాలిటీలు కాగా కొత్తగా తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలుగా ఏర్పడ్డాయి. వీటి పరిధిలోని గీత, చేనేత, బీడీ కార్మికులు, వయో వృద్ధులు, వితంతువులకు ప్రతి నెలా రూ.2,016, దివ్యాంగులకు రూ.3,016 ల చొప్పున పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. బయోమెట్రిక్ ద్వారా పోస్టాఫీసుల్లో ఇస్తున్నారు. వాస్తవంగా ప్రతినెలా 1 నుంచి 5వ తేదీ వరకు ఇవ్వాలి కానీ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

మున్సిపాలిటీ	పింఛన్‌దారులు
సూర్యాపేట	12,200
కోదాడ	9,135
హుజూర్‌నగర్	5874
తిరుమలగిరి	3146
నేరేడుచర్ల	1570

మున్సిపాలిటీల్లోని తపాలా కార్యాలయాలకు వెళ్లి నగదు తీసుకోవాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సిందే. కొందరు రూ.1000 చొప్పున చెల్లించి బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. మరి కొందరు సున్నా ఖాతాలు తెరిచారు. ఏటీఎం కార్డులు అందుకున్నారు. 90 శాతానికి పైగా మున్సిపాలిటీ కార్యాలయంలో జిరాక్స్ పత్రాలను సైతం సమర్పించారు. కానీ ఇంత వరకు ఒక్క పైసా జమ చేయలేదు. మరో వైపు లావాదేవీలు లేక బ్యాంకర్లు ఖాతాల్లో నిలిపివేస్తున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని మున్సిపాలిటీల్లో పింఛన్ డబ్బులను లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం అమలుకావడంలేదు.

వేలి ముద్రలు పడకపోతే..

కొన్ని సందర్భాల్లో సర్వర్ సమస్యతో మరుసటి రోజు వెళ్లక తప్పని పరిస్థితి. బయోమెట్రిక్ యంత్రంపై వేలిముద్రలు సరిగా పడకపోతే మున్సిపాలిటీ అధికారి వచ్చే వరకు ఆగాల్సిందే. వృద్ధులైతే మరింత ఇబ్బంది పడాల్సిందే. ఇలాంటి సమస్యల పరిష్కారంగా బ్యాంకు ఖాతాలో పింఛన్ డబ్బు జమ చేయాలని అధికారులు నిర్ణయించగా ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. విలీన గ్రామాల లబ్ధిదారులు కిలోమీటర్, రెండు కిలోమీటర్ల మేర నడిచి వేకువ జామునే వచ్చి పోస్టాఫీసుల వద్ద గంటల కొద్దీ నిరీక్షించాల్సిందే.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీలో జానా, ఉత్తమ్, కోమటిరెడ్డి



జానారెడ్డి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వెంకట్‌రెడ్డి

నల్లగొండ : రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 26 మందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా రేవంత్‌రెడ్డితోపాటు మరో 25 మంది సభ్యులను నియమించారు. అందులో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డికి స్థానం కల్పించారు.కాగా, రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో టికెట్ ఎవరికి కేటాయించాలన్న విషయంలో ఈ ముగ్గురి మాటకే ప్రాధాన్యం ఉండనుంది. రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్కతోపాటు ఈ ముగ్గురు నేతలు జిల్లాలో ఎన్నికల విషయంలో నిర్ణయాలు తీసుకోనున్నారు.

కోదాడ మున్సిపాలిటీలో అవినీతిపై విచారణ చేయాలి



అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

- అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పలువురు కౌన్సిలర్లు

కోదాడ: హరితహారం పేరుతో కోదాడ మున్సిపాలిటీలో కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని దీనిపై విచారణ జరపాలని పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్‌హేమంత్ కేశవ్‌కు ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్ అందుబాటులో ఉండడం లేదని, ఆమె భర్త మున్సిపాలిటీలో పెత్తనం చెలాయిస్తున్నాడని, బినామీ పేర్లతో కాంట్రాక్ట్ పనులు చేయిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి పనిలో 10 శాతం కమీషన్ కావాలని డిమాండ్ చేస్తున్నాడని, కొన్ని వార్డుల్లో కౌన్సిలర్లపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ పనులు చేయడం లేదని వివరించారు. ఫిర్యాదు చేసిన వారిలో వైస్‌చైర్మన్ వెంపటి పద్మ, కల్లూరి పద్మజ, కందుల కోటేశ్వరరావు, ఖదీర్, చందర్‌రావు, కోట మధు, చంద్రశేఖర్, గంధం యాదగిరి, గుండెల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. చైర్‌పర్సన్ భర్త పెత్తనం చేస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారిలో ఆరుగురు మహిళా కౌన్సిలర్ల భర్తలు ఉండడం కొసమెరుపు.

నిధుల మంజూరుకు నివేదిక పంపిస్తా

- జిల్లా జడ్జి రాజగోపాల్

తుంగతుర్తి: తుంగతుర్తిలోని నూతన కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని జిల్లా జడ్జి రాజగోపాల్ తెలిపారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టును ఆయన పరిశీలించారు. కోర్టులో రికార్డులను పరిశీలించి, మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన భవన నిర్మాణానికి మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారిపై కేటాయించిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రాచర్ల శాలిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హేమలత, న్యాయవాదులు తాళ్లపల్లి సత్యనారాయణ, కుమారస్వామి, నాగరాజు, కోర్టు సిబ్బంది అంజయ్య, పద్మ, పుష్ప, అనిల్, వంశీ పాల్గొన్నారు.



తుంగతుర్తిలో కోర్టు భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

వీడని ముసురు



నూతనకల్ మండలం గుండ్లసింగారం గ్రామ శివారులో పొంగి ప్రవహిస్తున్న ఏపూరు ఆనకట్ట

- మూడో రోజు 14.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

సూర్యాపేట : జిల్లా వ్యాప్తంగా మూడవరోజు గురువారం ముసురు వీడలేదు. సోమవారం రాత్రి మొదలైన ఈ ముసురు రాత్రి పగలు అనే తేడా లేకుండా వస్తూపోతూ ఉంది. గురువారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దాదాపు అన్ని మండలాల్లోనూ వర్షం పడింది. జిల్లా సరాసరి వర్షపాతం 14.9 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఎనిమిది మండలాల్లో మాత్రం ముసురు కాస్తా మోస్తరు వర్షంగా మారింది. వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు గురువారం, శుక్రవారం సెలవులు ప్రకటించింది. జిల్లాలోని తిరుమలగిరి మండలంలో అత్యధికంగా 41.3 మిల్లీమీటర్లు, మోతె 32.7, నూతనకల్ 29.3, తుంగతుర్తి 26.8, నాగారం 25.9, మద్దిరాల 24.8, జాజిరెడ్డిగూడెం 23.0, ఆత్మకూర్ ఎస్ 20.8, చివ్వెంల 15.2, పెన్‌పహాడ్ 14.7, గరిడేపల్లి 13.9, నడిగూడెం 12.8, మునగాల 11.8, సూర్యాపేట 11.7, అనంతగిరి 10.6, హుజూర్‌నగర్ 10.0, చిలుకూరు 5.3, పాలకవీడు 4.8, మఠంపల్లి 3.1, కోదాడ 1.8, నేరేడుచర్ల 1.4, మేళ్లచెరువు 1.0, చింతలపాలెం 1.0 చొప్పున వర్షం కురిసింది.

పొంగి ప్రవహిస్తున్న ఏపూరు ఆనకట్ట

నూతనకల్: నూతనకల్ మండల పరిధిలోని గుండ్లసింగారం గ్రామ శివారులోని పాలేరు వాగుపై నిర్మించిన ఏపూరు ఆనకట్ట మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గురువారం పొంగి ప్రవహిస్తోంది. ఇక్కడి నీటి పరవళ్ల అందాలు వీక్షించడానికి ప్రజలు తరలివచ్చారు. సెల్ఫీలు కూడా దిగారు.



సూర్యాపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వర్షాల కారణంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- అధికారులకు సెలవులు రద్దు
- కలెక్టర్ వెంకట్రావు వెల్లడి

ప్రజలు తక్షణసాయం కోసం ఫోన్ చేయాల్సిన నంబర్ 6281492368



ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌లతో కలిసి జిల్లాలోని అధికారులతో గురువారం వెబెక్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ఎగువ నుంచి మూసీ ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నందున గరిడేపల్లి, నేరేడుచర్ల, సూర్యాపేట మండలాల అధికారులు అలర్ట్‌గా ఉండాలన్నారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలరు. రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు పడే వీలున్నందున రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటు ఎంపీడీఓలు ,ఎంపీఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముందుగానే వరద ముప్పు ప్రాంతాలను గుర్తించాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి అందులో ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. నీటి ప్రవాహాలు, రోడ్లు, నాలాల పైనుంచి ప్రవహించే ప్రాంతాల్లో రెడ్ ఫ్లాగులు, సూచిక బోర్డులు పెట్టాలన్నారు. చెరువుల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పాఠశాలలను పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న వాటిని గుర్తించాలన్నారు. వర్షాల కారణంగా అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నామని, అత్యవసరం అయితేనే ఇస్తామన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌లో 24/7 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అత్యవసర సహాయం కోసం 6281492368 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా అధికారులు, మండల, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సందిగ్ధంలో కోదాడ డీఎస్పీ పోస్టింగ్

- మంత్రి వద్దకు చేరిన పంచాయితీ

కోదాడ: కోదాడ డీఎస్పీ బదిలీ, కొత్త డీఎస్పీ పోస్టింగ్ వ్యవహారం సందిగ్ధంలో పడినట్లు విశ్వసనీయ సమాచారం. కోదాడ డీఎస్పీగా పని చేస్తున్న వెంకటేశ్వరరెడ్డిని గత శనివారం బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. కోదాడ నూతన డీఎస్పీగా వెంకటేశ్వర రెడ్డి స్థానంలో హైదరాబాద్‌లో పని చేస్తున్న బి. ప్రకాశ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాను కోదాడ డీఎస్పీగా నియామకమై ఏడాదిన్న మాత్రమే కావడం, ఎన్నికల బదిలీల్లో తాను లేకున్నా ఆకస్మికంగా తనను బదిలీ చేయడంపై వెంకటేశ్వర రెడ్డి జిల్లా మంత్రికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంతే కాకుండా తనకు ఏ మాత్రం సమాచారం లేకుండా నూతన డీఎస్పీ నియామకం జరగడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నూతన డీఎస్పీ నియామకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఐదు రోజులుగా నూతన డీఎస్పీ బాధ్యతలు తీసుకోలేదు. ఈ క్రమంలో గురువారం హుజూర్‌నగర్‌కు వచ్చిన మంత్రిని పాత, కొత్త డీఎస్పీలు కలిసి పోస్టింగ్‌పై చర్చించినట్లు తెలిసింది. ఈచర్చల సారాంశాన్ని బట్టి కోదాడ డీఎస్పీగా ఎవరు వస్తారో తెలనుంది. వీరిద్దరు కాకుండా మూడో వ్యక్తి కోదాడ డీఎస్పీగా వచ్చే అవకాశం కూడా ఉందని మరో సమాచారం.

స్కూల్‌గేమ్స్‌కు గ్రీన్ సిగ్నల్

- షెడ్యూల్ విడుదల చేసిన పాఠశాల విద్యా డైరెక్టర్
- ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నిర్వహించేలా ప్రత్యేక ప్రణాళిక
- విద్యార్థులు, క్రీడాకారుల్లో ఉత్సాహం



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

హుజూర్‌నగర్: పాఠశాల దశలో విద్యార్థికి చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరం. ఈ నేపథ్యంలోనే ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వారికి ఆటల పోటీలు నిర్వహిస్తుంటారు. అండర్ 14, 17, 19 ఏళ్ల విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈ క్రీడా పోటీలు జరుగుతాయి. అయితే కోవిడ్ మహమ్మారి కారణంగా 2020 నుంచి 2023 వరకు ఈ పోటీలను నిర్వహించలేదు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ క్రీడా పోటీల నిర్వహణకు ఈనెలలోనే ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహిస్తామని ప్రకటించారు.

సుమారు 1.42 లక్షల మంది విద్యార్థులు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అన్నీ కలిపి దాదాపు 1,344 వరకు ఉన్నాయి. వాటిలో 1.42 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో పాఠశాలలు 1,271 ఉండగా 1.39 లక్షల మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ కళాశాలలు 73 ఉండగా 12 వేల మంది విద్యార్థులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాల స్థాయిలో..

పాఠశాలల స్థాయి (అండర్- 14, అండర్-17), కళాశాలల స్థాయి (అండర్ -19) ఎస్‌జీఎఫ్ పోటీలు గతంలో కొత్త జిల్లాల ప్రాతిపదికన నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు 33 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. దీంతో ఈ పోటీల నిర్వహణ భారం కావడంతో పాటు అధిక సమయం పట్టింది. ఈ నేపథ్యంలో ఈ సారి ఉమ్మడి పది జిల్లాల ప్రకారమే నిర్వహించాలని ఉన్నతాధి కారులు నిర్ణయించారు.

సెప్టెంబర్ రెండో వారంలో జిల్లా స్థాయిలో..

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను మండల స్థాయిలో ఆగస్టు నెల మొదటి, రెండవ వారంలో పూర్తి చేయాలి. జోనల్ స్థాయిలో ఆగస్టు మూడో వారంలో పూర్తి చేయాలి. పాత ఉమ్మడి జిల్లా స్థాయిలో సెప్టెంబరు మాసం రెండో వారంలో పూర్తి చేయాల్సి ఉంది. ఇక రాష్ట్ర స్థాయిలో సెప్టెంబరు చివరి వారంలో పూర్తి చేయాలి. జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు సిద్ధంగా ఉండాలి.

విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది



నాలుగేళ్లుగా స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించక పోవడంతో విద్యార్థుల్లో కొంత నిరాశ నెలకొంది. ప్రభుత్వం ఇటీవల పాఠశాలల క్రీడల నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేయడంతో కొత్త ఉత్సాహం వచ్చింది. వారిని ఆయా క్రీడలకు సిద్ధం చేస్తున్నాం.

– ఎండీ ఆజంబాబా, పీడీ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, సూర్యాపేట

విద్యార్థుల్లో చురుకుదనం పెరుగుతుంది

విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలో చురకుదనం పెరుగుతుంది. మానసిక, శారీరక దృఢత్వం వస్తుంది. దీని కోసమే ప్రభుత్వం ఇటీవల పాఠశాలల్లో క్రీడల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ప్రాథమిక పాఠశాలలకు రూ. 5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ. 10 వేల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానాలతో ఆయా పాఠశాలలకు కావాల్సిన ఆట వస్తువులు కొనుగోలు చేసి విద్యార్థులకు అందించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి


లింగస్వామి (ఫైల్)

రామన్నపేట: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన గురువారం రామన్నపేట మండలంలోని నీర్నెముల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నీర్నెముల గ్రామానికి చెందిన సుర్వి లింగస్వామి(47) కల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని ఓ రైతు పొలం వద్ద కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెట్టు పైనుంచి బురద పొలంలో పడ్డాడు. దీంతో అతడి తల, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి బురదలో నుంచి లేపి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. లక్ష్మయ్య తెలిపారు.

విద్యుత్‌ స్తంభం పైనుంచి పడి..

డిండి: విద్యుత్‌ స్తంభం ఎక్కుతుండగా కాలు జారి కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన డిండి మండల పరిధిలోని గోనకొల్‌ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనకొల్‌ గ్రామానికి చెందిన విభూది వెంకట్రాం(54) అదే గ్రామపంచాయతీలో కార్మికుడి(మల్టీవర్కర్)గా పని చేస్తున్నాడు. కాగా గురువారం గ్రామంలోని ఓ కాలనీలో విద్యుత్‌ సరఫరా నిలిచి పోవడంతో దానిని సరిచేసేందుకు విద్యుత్‌ స్తంభాన్ని ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. అతడికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కాగా ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

● దంచి కొట్టిన వర్షం


భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామ పరిధిలో వర్షంలోనే అన్నం తింటున్న మహిళా కూలీలు


యాదాద్రి కొండపై వర్షంలో తడుస్తూ పరుగులు పెడుతున్న భక్తులు


హైదరాబాద్‌-వరంగల్‌ జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం


యాదాద్రి కొండ కింద గండి చెరువులోకి చేరుతున్న వర్షం నీరు


యాదాద్రి కొండపై ఆలయ వీధుల్లో నుంచి ప్రసాద కౌంటర్ల వరకు పారుతున్న నీళ్లు


ఆలేరు మండల శివారులో వరంగల్‌-హైదరాబాద్‌ జాతీయ రహదారి పక్కన పత్తి చేనులో నిలిచిన వర్షం నీరు

ఒకే రోజు మృతిచెందిన వృద్ధ దంపతులు

యాదగిరిగుట్ట రూరల్‌: వృద్ధ దంపతులు ఒకే రోజు మృతిచెందిన ఘటన యాదగిరిగుట్ట మండలంలోని జంగంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపల్లి గ్రామానికి చెందిన మాటూరి లక్ష్మమ్మ (70), మాటూరి శంకరయ్య (78) భార్యాభర్తలు. వీరిద్దరు గ్రామంలోనే నివసిస్తూ ఉన్నారు. కాగా లక్ష్మమ్మ అనారోగ్యంతో మంగళవారం వేకువజామున మృతిచెందగా, అదే రోజు రాత్రి సమయంలో శంకరయ్య కూడా అనారోగ్యంతోనే చనిపోయాడు. లక్ష్మమ్మ అంత్యక్రియలు మంగళవారం, శంకరయ్య అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. ఒకే రోజు కొద్ది గంటల వ్యవధిలో వృద్ధ దంపతులు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

హైవేపై భారీగా ట్రాఫిక్‌ జామ్‌


గుండ్రాంపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు


డీసీఎంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటికి తీస్తున్న స్థానికులు

- గుండ్రాంపల్లి శివారులో కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన డీసీఎం
- డీసీఎం డ్రైవర్‌కు గాయాలు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరగడంతో రెండు, మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌ జామ్‌ ఏర్పడింది. వివరాలు.. విజయవాడ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం గుండ్రాంపల్లి గ్రామ శివారులోని బతుకమ్మకుంట సమీపంలో జాతీయ రహదారిపై బ్రేక్‌ డౌన్‌ అయ్యి నిలిచిపోయిన కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ ముజాఫర్‌ఖాన్‌ డీసీఎంలో ఇరుక్కుపోయాడు. స్థానికులు అతడిని బయటికి తీసి అంబులెన్స్‌లో చౌటుప్పల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో హైవేపై సుమారు రెండు, మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌ జామ్‌ ఏర్పడింది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న నార్కట్‌పల్లి సీఐ మహేష్‌తో పాటు పోలీసు సిబ్బంది, జీఎంఆర్‌ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వైభవంగా నృసింహుని నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తి కట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్యధారణ చేయించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ చెన్నూరు విజయ్‌కుమార్‌, ఈఓ నవీన్‌, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, బ్రహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అనుమానాస్పద స్థితిలో 20 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

అడ్డగూడూరు: అనుమానాస్పద స్థితిలో 18 గొర్రెలు, 2 గొర్రెపిల్లలు మృతిచెందిన ఘటన అడ్డగూడూరు మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన నోముల యాదగిరి, నోముల నవీన్‌ గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగా గురువారం తెల్లవారుజామున 5గంటల సమయంలో తమ గొర్రెలను ఇంటి వద్ద ఉన్న దొడ్డిలో నుంచి గ్రామ శివారులోని దొడ్డిలోకి తోలి తిరిగి ఇంటికి వచ్చారు. అనంతరం ఉదయం 10గంటల సమయంలో గొర్రెలను మేపడానికి గ్రామ శివారులోని దొడ్డి వద్దకు వెళ్లగా.. 18 గొర్రెలు, 2 గొర్రెపిల్లలు మృతిచెంది ఉన్నాయి. ఈ విషయాన్ని స్థానిక పశువైద్యాధికారులకు తెలపగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. మృతిచెందిన గొర్రెలను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ట్రాక్టర్‌ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు


చెరువు కట్ట దిగువన బోల్తాపడిన ట్రాక్టర్‌

మాడుగులపల్లి: ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందుగుల గ్రామానికి చెందిన మిర్యాల దయాకర్‌రెడ్డి (55) తనకున్న ఎనిమిదెకరాల్లో వ్యవసాయం చేస్తూ ట్రాక్టర్‌ను కిరాయికి సైతం నడుపుతుంటాడు. గురువారం ఉదయం ఓ రైతుకు చెందిన పొలం దున్నేందుకు ట్రాక్టర్‌కు కల్టివేటర్‌ బిగించుకొని చెరువుకట్ట పైనుంచి వెళ్తుండగా అదుపుతప్పి కట్ట దిగువన బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌ నడుపుతున్న దయాకర్‌రెడ్డికి గేర్‌ రాడ్డు కడుపులోకి బలంగా గుచ్చుకుపోయి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన నల్లగొండలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మాడుగులపల్లి పోలీసులు పేర్కొన్నారు.



అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులు క్షేమం


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

కోదాడరూరల్‌: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టి పెంటకుప్పలోకి దూసుకెళ్లిన ఘటన కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. హైదరాబాద్‌లోని మియాపూర్‌ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 30 మంది ప్రయాణికులతో విజయవాడ వెళ్తుంది. మార్గమధ్యలో కోదాడ పట్టణంలోకి రాగానే బైపాస్‌ దిగిన తర్వాత కొమరబండ శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి పెంటకుప్పలోకి దూసుకెళ్లి ఆగింది. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడ్డారు. డ్రైవర్‌ అతివేగం, నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్‌


వివరాలు వెల్లడిస్తున్న సీఐ బ్రహ్మ మురారీ

నూతనకల్‌: వివిధ దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తుంగతుర్తి సీఐ బ్రహ్మ మురారీ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్‌ మండలం వెంకెపల్లి గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంతో పాటు తుంగతుర్తి మండల పరిధిలోని వివిధ దేవాలయాల్లో ఇటీవల వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. కాగా గురువారం నూతనకల్‌ మండల పరిధిలోని ఎర్రపహాడ్‌ క్రాస్‌ రోడ్డు వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండల పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన కొమ్మరగిరి యాకోబ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. వెంకెపల్లి దేవాలయంతో పాటు తుంగతుర్తి మండలంలోని గుడితండా, దొనబండా తండాల్లోని దేవాలయాల్లో తానే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు గతంలో సొంతమాగులూరు, నాంపల్లి, మేడికొండూర్‌ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడడంతో పాటు తాళాలు వేసిన గుళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేస్తున్నాడని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నరేష్‌, హెడ్‌కానిస్టేబుల్‌ వల్లపు నారాయణ, సిబ్బంది దాచేపల్లి అరవింద్‌, తిరపతయ్య, అమృతయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్‌.. వ్యక్తి దుర్మరణం

రామగిరి(నల్లగొండ): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందిన ఘటన గురువారం తిప్పర్తి మండలంలోని చిన్న సూరారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. నకిరేకల్‌ పట్టణంలోని కాటమయ్య బజార్‌కు చెందిన తాటి లక్ష్మీనారాయణ(51) గురువారం రిజిస్ట్రేషన్‌ పని నిమిత్తం నల్లగొండకు బైక్‌పై వచ్చాడు. పని పూర్తి చేసుకుని తిరిగి రాత్రి నకిరేకల్‌కు వెళ్తుండగా చిన్న సూరారం వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు.

ముగ్గురు బాల నేరస్తుల అరెస్ట్‌

- 4 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం


బాల నేరస్తుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ రాఘవేందర్‌, ఎస్‌ఐ శివతేజ్‌

మిర్యాలగూడ అర్బన్‌: చదువు మధ్యలోనే ఆపేసి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు బాల నేరస్తులను మిర్యాలగూడ వన్‌ టౌన్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాఘవేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడకు చెందిన ఇద్దరు, శాంతినగర్‌కు చెందిన ఒకరు మొత్తం ముగ్గురు బాలురు తమ చదువు మధ్యలోనే ఆపేశారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారిన ఆ ముగ్గురు బాలురు దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో గత మూడు నెలలుగా మిర్యాలగూడ పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలలో పార్కింగ్‌ చేసిన బైక్‌లను చోరీ చేసేవారు. ఈ విధంగా మిర్యాలగూడ వన్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో 4, మిర్యాలగూడ రూరల్‌ పరిధిలో 2, వాడపల్లి పరిధిలో 1, దేవరకొండ పరిధిలో 1, దాచేపల్లి పరిధిలో 1 కేసు వీరిపై నమోదయ్యాయి. గురువారం మిర్యాలగూడ పట్టణంలో వన్‌ టౌన్‌ కానిస్టేబుళ్లు నాగరాజు, వెంకటేశ్వర్లు వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఈ ముగ్గురు బాలురు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన దొంగతనాలను అంగీకరించారు. ఈ ముగ్గురూ కలిసి ఇరిగేషన్‌ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 5 ఐరన్‌ గేర్‌ బాక్స్‌లను చోరీ చేశారని, వీరిలో ఒకరిపై గతంలోనే 11 కేసులు నమోదయ్యాయని పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుంచి 4 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ ముగ్గురు బాల నేరస్తులను హైదరాబాద్‌లోని సైదాబాద్‌ ఏరియాలో గల జువైనల్‌ హోంకు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా నేరస్తులను పట్టుకున్న కానిస్టేబుళ్లతో పాటు సీఐ రాఘవేందర్‌, ఎస్‌ఐ శివతేజ్‌లను జిల్లా ఎస్పీ అపూర్వ రావు అభినందించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

ఆలేరురూరల్‌: మండలంలోని కొల్లూరు గ్రామ శివారులో గురువారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతిచెందాయి. వివరాలు.. కొల్లూరు గ్రామానికి చెందిన గాజుల అంజయ్య తన రెండు పాడి గేదెలను వ్యవసాయ బావికి తీసుకెళ్తున్నాడు. మధ్యలో గేదెలు వాగు దాటే క్రమంలో ఇనుప విద్యుత్‌ స్తంభానికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి.

తిరుమల ట్రేడింగ్‌ కంపెనీలో తనిఖీలు

బీబీనగర్‌: మండలంలోని రాఘవాపురంలో తిరుమల ట్రేడింగ్‌ పరిశ్రమలో గురువారం పొల్యూషన్‌ బోర్డు అధికారులు తనిఖీలు చేశారు. తమ గ్రామం నుంచి పరిశ్రమను దూరంగా తరలించాలని గ్రామస్తులు వారం రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కంపెనీ నుంచి వస్తున్న కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నామని, ఈ విషయంపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు మొక్కుబడిగా పొల్యూషన్‌ బోర్డు సిబ్బందిని పంపి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వచ్చే వరకు దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్ష చేస్తున్నవారితో పోలీసులు చర్చలు జరిపారు. శాంతియుతంగా దీక్ష కొనసాగించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

అసై దులా..!

ప్రారంభమైన మొహర్రం నెల
- పీర్లకొట్టాల్లో కొలువుదీరిన సవార్లు
- కులమతాలకతీతంగా గ్రామాల్లో సందడే సందడి


భువనగిరి పట్టణంలో కొలువుదీరిన పీర్లు

భువనగిరిటౌన్‌: అసై దులా.. అసైదులా అంటూ ఆలావా చుట్టూ ఆటలు.. కాళ్లకు గజ్జెలు కట్టుకొని పీర్లు ఎత్తుకొని ఎగరడం.. కమ్మనైన షర్బత్‌(బెల్లం పానకం) తాగి ఊదుపొగ వాసనతో భక్తిపారవశ్యంలో మునిగి పోవడం.. ఇదంతా మొహర్రం మాసంలో మొదటి పది రోజుల పాటు పల్లెలు, పట్టణాల్లో కన్పించే వాతావరణం. హిజ్రీ శకం ఆధారంగా మొదలైన ఇస్లాం క్యాలెండర్‌ ప్రకారం మొదటి మాసం మొహర్రం. దీనిని షహీద్‌(అమరుల) నెల అని కూడా అంటారు. గురువారం నుంచి ఈనెల ప్రారంభమైంది. ఇప్పటికే పీర్ల కొట్లాల్లో సవార్లు కొలువుదీరాయి.

ఇమామ్‌ హుస్సేన్‌ అమరత్వాన్ని స్మరించుకుంటూ..

కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మహ్మద్‌ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం మనవడు ఇమామ్‌ హుస్సేన్‌ మొహర్రం మాసంలో 10వ తేదీన అమరుడయ్యారు. దీంతో ఆ రోజును యౌమె ఆషూరా అని పిలుస్తారు. దీనిని స్మరించుకుంటూ ఈనెలలో మొదటి పది రోజుల పాటు శోక తప్త దినాలుగా పాటిస్తారు. షియా ముస్లింలు మాతం నిర్వహిస్తారు. వీరు 68 రోజుల పాటు శోక దినాలుగా పాటిస్తారు.

హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీకగా..

నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రంను ముస్లింలే కాక అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవడం ఏళ్లతరబడి ఆనవాయితీగా వస్తోంది. ప్రజలు పీర్లకు దట్టీలు, కుడుకలు, బెల్లం, డబ్బులు కట్టి తమ మొక్కులు చెల్లించుకుంటారు. మతసామర్యానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తుంది.

భువనగిరి పట్టణంలో ప్రత్యేకంగా..

భువనగిరి పట్టణంలోని ఖాజీమహల్లాలో మొహర్రం కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. చిన్నా, పెద్ద అనే తార తమ్యం లేకుండా దారిపొడవునా ఎదపై కత్తులతో బాదుకుంటూ రక్తాన్ని చిందిస్తూ మాతం ప్రదర్శన నిర్వహిస్తారు. పదో రోజున పీర్లను ఊరేగిస్తారు. అంతకుముందు రాత్రి అగ్ని గుండంలో దూకడం, అగ్గిలో నడవటం వంటివి చేస్తారు. హజరత్‌ ఇమాం హుసేన్‌ ను స్మరించుకుంటూ పంజా(పీర్ల ప్రతిమ)లను ఊరేగించి తమ సంతాపం ప్రకటిస్తారు.